క్లుప్తంగా

నేడు వ్యాఘ్రేశ్వరంలో అగ్నిష్టోమ యాగం

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో సోమవారం నుంచి ఈ నెల 15 వరకు అగ్నిష్టోమ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. ఆకెళ్ల వ్యాఘ్రేశ్వర వెంకటరామ సూర్య సుబ్రహ్మణ్య నరసింహ హవిర్యాజిశర్మ నిర్వహిస్తారని చెప్పారు. యాగ క్రతువును తిలకించి, యజ్ఞ ప్రసాదం, నిత్య అన్నసమారాధన స్వీకరించి యజ్ఞేశ్వర కృపకు పాత్రులు కాగలరని కోరారు. లోక కళ్యాణార్థం జరుగుతున్న యాగానికి యథాశక్తి విరాళాలు పంపి యాగ నిర్వహణలో భాగస్వాములు కాగలరని యాగ కార్యనిర్వాహక కమిటీ, వ్యాఘ్రేశ్వర గ్రామస్తులు కోరారు.

నేటి నుంచి పెద్దింట్లమ్మ తీర్థం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ ఆదివారం తెలిపింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వచ్చే నెల 8వ తేదీ వరకూ నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 19న ఉదయం అమ్మవారి ప్రభ ఊరేగింపు, అదే తేదీ రాత్రి గోకర్ణేశ్వర స్వామి, జలదుర్గ అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 9వ తేదీన అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య బృందం సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా త్రిశూలస్నానం

కొత్తపేట: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి, మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వార్ల త్రిశూల స్నానం కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ఉదయం నుంచీ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు, నిర్వహించి అనంతరం పలివెల వంతెన వద్ద కాలువలో త్రిశూల స్నానం నిర్వహించారు. అలాగే మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి ఆలయంలో ఈవో కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామికి తైలాభిషేకాలు, అర్చనలు, పూర్ణాహుతి అనంతరం స్థానిక కాలువలో త్రిశూల స్నానం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ హోమం

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువైన బాల బాలాజీ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీనారాయణ హోమం ఘనంగా జరిగింది. పలువురు భక్తులు హోమంలో పాల్గొన్నారు. స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు నగరం గ్రామానికి చెందిన వానరాశి కాశీవిశ్వేశ్వరరావు, సత్యానందం దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.1.01 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.మాధవి, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు.

శంకరగుప్తంలో భగవద్గీత ప్రచారం

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం జరిగింది. ఇందులో భాగంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక-మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మాట్లాడుతూ శివలింగంపైన ఉన్న 'మూడు విభూతి రేఖలు జీవాత్మ ఆత్మ పరమాత్మలకు గుర్తు' అని ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, బ్రహ్మాజీ, సుబ్బారావు, పూర్ణ, జగదీష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరం ద్వారా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జి.అంజలి (జనరల్ మెడిసిన్), కోట నితీశ్వర్ (చిన్న పిల్లల వైద్యం), సలాది శర్వాణి (స్త్రీ వైద్య నిపుణురాలు) ప్రజలకు సేవలందించారు. పలువురికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా ఈసీజీలు తీశారు. సేవ సంస్థ నిర్వాహకులు బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో సర్పంచ్ గోస్ మొహిద్దీన్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే వర్ధంతి

మలికిపురం: మహిళలకు విద్యాభివృద్ధి హక్కుల కోసం కృషి చేసి తొలి తరం మహిళ ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని బహుజన సమన్వయ సమాఖ్య ఆధ్వర్యంలో సమన్వయ సమాఖ్య అధ్యక్షుడు గడ్డం తులసీభాస్కరరావు అన్నారు. ఆదివారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో సావిత్రీబాయి వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో బత్తుల ఝాన్సీ, మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం ఫిలిప్‌రాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, వెటర్నరీ డాక్టర్ బందెల సంపత్ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో అత్యాధునిక వైద్య సేవలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేట సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్, వానపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్ ప్రారంభం


కొత్తపేటలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద దయాలసిస్ సెంటర్ భవన ప్రారంభ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఏపీ వైద్య విధాన పరిషత్ కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆవరణలో ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.39.18 లక్షలతో నిర్మించిన కిడ్నీ డయాలసిస్ యూనిట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని, వానపల్లి పీహెచ్‌సీ ఆవరణలో రూ.40 లక్షలతో నిర్మించిన ల్యాబ్ భవనాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఎప్పుడూ అమలు కాని ప్రజా సంక్షేమ పథకాలు, ప్రజారోగ్య పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. వైద్య రంగానికి సంబంధించి ఈ ఆస్పత్రిలో ఏ విధమైన అభివృద్ధి, ఆధునీకరణ, మౌలిక సౌకర్యాలు కల్పించినా నాడు వైఎస్సార్, నేడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాల హయాంలోనేనని అన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత డయాలసిస్ చేయించుకోవాలంటే రాజమహేంద్రవరం, అమలాపురం పెద్దాసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. డయాలసిస్ యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేయించుకోగా త్వరలోనే సెంటర్ సేవలు ప్రారంభిస్తామన్నారు. ఇంకా ఇక్కడే రూ.2.38 కోట్లతో ఆస్పత్రి అదనపు భవనం, ఆలమూరు సీహెచ్‌సీలో రూ.5 కోట్లతో, ఆత్రేయపురం మండలం ర్యాలి పీహెచ్‌సీలో రూ.3 కోట్లతో భవనాలు నిర్మించామన్నారు.

పలివెలలో ప్రారంభ, శంకుస్థాపనలు

మండలంలోని పలివెల అరుంధతీయపేట వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలపై ఎంపీపీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన షెడ్డును జగ్గిరెడ్డి ప్రారంభించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలతో పలివెల కోటమెరక ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి, అక్కడే ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, ఎంపీటీసీలు చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత నాలుగో విడత విడుదల

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకాన్ని సోమవారం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నట్లు వెలుగు ఏపీఎం ఆర్.గంగాధర్ తెలిపారు. 45 నుంచి 60 ఏళ్ల లోపు వయసు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించి ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. ప్రతి ఏటా రూ.18,750లు చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు ఒక్కో మహిళకు లబ్ధి చేకూరుతుంది. అంబాజీపేట మండలానికి సంబంధించి మొదటి విడత 3,862 మందికి గాను రూ.724.13 లక్షలు, రెండో విడతలో 4,038 మందికిగాను రూ.757.13 లక్షలు, మూడో విడతలో 4,072 మందికి గాను రూ.763.50 లక్షలు మంజూరయ్యాయి. నాలుగో విడతకు సంబంధించి 4129 మందికి గాను రూ.774.19 లక్షల నగదు ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి.

రక్షిత తాగునీరు అందించాలన్నదే లక్ష్యం


అంతర్వేదికరలో తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాపాక


దిండిలో తాగునీటి ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం అంతర్వేదికరలో జేజేఎంలో రూ.31 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఆయన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో చేపట్టబోయే సీసీ రోడ్లు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, తీరంలో ప్రజల దాహార్తికి అడ్డుకట్ట వేసే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జేజేఎంలో మంజూరైన నిధులు రూ.17.33 కోట్లతో అంతర్వేది చెరువు సమగ్ర రక్షిత తాగునీటి పథకంగా రూపుదిద్దుకుంటోందన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ పోతురాజు నరసింహారావు, ఎంపీటీసీలు చొప్పల బాబూరావు, గుబ్బల అంజి, పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, నాయకులు గెడ్డం అమ్ములు, దొంగ నాగ సత్యనారాయణ, దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసుబాబు, జాన శంకరరావు పాల్గొన్నారు. అంతర్వేది దేవస్థానంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో నిర్మించే సీసీ రోడ్లుకు ఎమ్మెల్యే వరప్రసాదరావు శంకుస్థాపనలు చేశారు. అలాగే పల్లిపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు, పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు కొల్లాటి నరసింహ స్వామి, చొప్పల చిట్టిబాబు, నాయకుడు ఏసుబాబు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మలికిపురం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని దిండి గ్రామం పెద్ద కాలువగట్టు గడపగడప మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన పదివేల లీటర్ల సామర్థ్యం గల వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభించారు. సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో తమ ఉనికి కోసం ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు విమర్శలే తప్ప ఆధారాలతో చేసేవి ఏమీ లేవని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిరుపేదల కుటుంబాలు ఎన్నో అవస్థలు పడ్డాయని వాటిని తన పాదయాత్ర ద్వారా తెలుసుకుని ఆ దిశగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసే గతంలోనే వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేసి జగన్‌ను మరోసారి సీఎం చేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, రాయుడు విమల, గొల్ల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే శెట్టిబలిజలకు సముచిత స్థానం


మలికిపురంలో దొమ్మేటి ఉమ, గుబ్బల బాబ్జిలను కలిసిన కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు


ఉయ్యూరువారి మెరకలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట్రామరాజును కలసిన గొల్లపల్లి

మలికిపురం: రాష్ట్రంలో శెట్టిబలిజలకు సముచిత స్థానం కల్పించింది సీఎం జగన్ మాత్రమేనని వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం మలికిపురంలో తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, నాయకులు గుబ్బల బాబ్జి తదితరులను గొల్లపల్లి మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు గొల్లపల్లిని శాలువతో సత్కరించారు. సూర్యారావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్సార్ హయాం నుంచీ కూడా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో శెట్టిబలిజలకు తగిన సీట్లు ఇచ్చి గౌరవించారని అన్నారు. మలికిపురంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా ప్రకాశరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. గంటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు మరువలేనివని సూర్యారావు అన్నారు. సరెళ్ల విజయ ప్రసాద్, స్టూడియో వర్మ, కొల్లాబత్తుల కుమార్, తాడి సహదేవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పలు గ్రామాల్లో సూర్యారావు పర్యటన

సఖినేటిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రముఖులను కలిశారు. ఉయ్యూరువారి మెరకలో పీఏసీఎస్ అధ్యక్షుడు కంతేటి వెంకట్రామరాజు, మాజీ సర్పంచ్ ఉయ్యూరు పెదబాబు, నాయకులు ఉప్పు సోమరాజు, చింతా సుధాకర్‌రావు, కారుపర్తి భాస్కరరావులను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే అప్పనరామునిలంకలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, బర్రే రాములను కలిశారు. వెంట సరెళ్ల విజయ్ ప్రసాద్, కొల్లాబత్తుల కుమార్, తాడి సహదేవ్, వలవల రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓటమి భయంతో టీడీపీ వారు మభ్యపెట్టి, మాయచేసి బలవంతపు చేరికలు చేస్తున్నారని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో అసత్య ఆరోపణలు, వారి జేబులోని చానెల్స్, న్యూస్ పేపర్లలో డబ్బులిచ్చి వార్తలు వేయించడం తప్ప 2014 నుంచి 2019 వరకు వీళ్ల కూటమి ప్రజలను చేసిన మోసాల గురించి కూడా ప్రచారం చేయిస్తే ఇంకా బాగుంటుందని జగ్గిరెడ్డి ఎద్దేవా చేశారు. బండారు సత్యానందరావు బలవంతంగా టీడీపీ కండువా కప్పిన రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామ శివారు పెంకులపాటిగురువుకు చెందిన వాసంశెట్టి శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, గుబ్బల రామకృష్ణ, గుబ్బల కుమారస్వామి, గుబ్బల నాగరాజులు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కలసి వారిని ఏ విధంగా బలవంతపు చేరికలు చేశారో వివరించారు. అనంతరం వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గుబ్బల లోవకృష్ణ, నామాల ప్రసాద్, వార్డ్ మెంబర్ గుబ్బల శ్రీను, నామాల సత్తిబాబు, ఇళ్ల శ్రీను, నామాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేంద్ర



మామిడికుదురు: మండలంలోని కొమరాడ గ్రామానికి చెందిన భూపతి మహేంద్రని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడిగా నియమించారు. దీనికి సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్ ఆదివారం తెలిపారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని మామిడికుదురు మండలానికి చెందిన గ్రామాలకు మహేంద్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. మహేంద్రను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఘనంగా సత్కరించారు. పలువురు మహేంద్రను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

శెట్టిబలిజలు జగన్‌కు మద్దతు పలకాలి


పోతవరంలో చెల్లుబోయినను సత్కరిస్తున్న శెట్టిబలిజ నాయకులు

పి.గన్నవరం: అన్ని రంగాల్లో శెట్టిబలిజలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శెట్టిబలిజలంతా మద్దతు పలకాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పోతవరం గ్రామంలో పార్టీ రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల శెట్టిబలిజ నాయకుల ఆత్మీయ సమావేశంలో చెల్లుబోయిన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాజకీయంగా ఎదిగేందుకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో శెట్టబలిజలకు సీఎం జగన్ సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. సీఎంగా జగన్‌ను, స్థానిక ఎమ్మెల్యేగా విప్పర్తి వేణుగోపాలరావును గెలిపించాలని కోరారు. శెట్టిబలిజల సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని చెల్లుబోయిన హామీ ఇచ్చారు. ఆయన్ను దుశ్శాలువాతో నాయకులు సత్కరించారు. రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, సర్పంచ్ గుడాల రామారావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కడలి వెంకటరమణ, దూనబోయిన రవిచంద్ర, కుడుపూడి రాము, గుత్తుల సత్యనారాయణ, దాసు, బొక్కా ఏడుకొండలు, వేండ్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఈసారితో ఆ కుర్చీని మడత పెట్టాల్సిందే..


మడుపల్లిలో పార్టీ నాయకులను, కార్యకర్తలను కలసి పనిచేయాలని కోరుతున్న విప్పర్తి

అయినవిల్లి: రాష్ట్రంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మాటను వినే వారే లేరని ఆయన ఈసారితో ఆ కుర్చీని మడత పెట్టాల్సిందేనని ఈ సార్వత్రిక ఎన్నికల్లో సీఎం కుర్చీలో కూర్చునేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఒక్కరేనని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మడుపల్లి, చింతనలంక, వెలువలపల్లి గ్రామాల్లోని పార్టీ నాయకులను, కార్యకర్తలను కలసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత అయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే ఒక్క జగన్ వల్లే సాధ్యపడుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాటలను నమ్మేందుకు ఇక్కడ తెలివి తక్కువ వారు ఎవరూ లేరన్నారు. ఇప్పటికే ఆ రెండు పార్టీలు పొత్తులతో ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించడంలో ఫెయిలయ్యారన్నారు. మరెప్పుడు పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తారు మరెప్పుడు పార్టీ ప్రచారాలను మొదలు పెడతారో తెలియని సంశయంలో ఆ పార్టీకి చెందిన నాయకులు తలలు పట్టుకుంటున్నారన్నారు. 40 ఇయర్స్ చంద్రబాబు చరిత్ర ఏమైందన్నారు. ఈ సారి 175కు 175 సీట్లు కైవసం చేసుకునే దిశగా సీఎం జగన్ పక్కా ప్రణాళికలు రూపొందించారన్నారు. 100 శాతం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం జగన్ సఫలీకృతులయ్యారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, పేరిచర్ల రఘురాజు, వాసంశెట్టి తాతాజీ, రమణాతి రాంబాబు, పులగుర్తి శ్రీనివాస్, సానబోయిన నాగేశ్వరరావు, పినిపే బుజ్జి, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం

మలికిపురం: రాజోలు నియోజకవర్గం యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. లక్కవరంలో మామిడితోటలో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రెసిడెంట్‌గా మందపాటి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా మట్టా రామకృష్ణ, సెక్రటరీగా నూనె రామకష్ణ, ట్రెజరర్‌గా మన్నె నూకాలరావు, మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే ప్రతి మండల స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. యాదవుల అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఈ కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా యాదవ సంఘ సభ్యులు, రాజకీయ నాయకులు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

సఖినేటిపల్లి: మండలంలోని గొంది పంచాయతీ రోడ్డు, రామేశ్వరం మొక్కతోట ఏరియాల్లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్యల పరిష్కారం నిమిత్తం వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన అన్నారు. ఆ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులు సమర్పించిన వస్త్రాల వేలం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయం ప్రాంగణంలో ఆదివారం అధికారులు స్వామివారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహించారు. వేలం పాటల్లో వివిధ రకాల వస్త్రాల నుంచి మొత్తం రూ.35,750 ఆదాయం వచ్చినట్టు ఏసీ సత్యనారాయణ తెలిపారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్ పాల్గొన్నారు.

భక్తుల సేవే మాధవ సేవ

అయినవిల్లి: భక్తులకు సేవలు అందించడం ద్వారా మాధవునికి నిజమైన భక్తిని చాటుకోవచ్చని అతనే మాధవునికి ప్రియ భక్తుడని నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభూజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీకృష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. శ్రీకృష్ణుడు విశ్వాంతర్యామి అని అన్నిటా ఆయనే కొలువై ఉన్నాడన్నారు.

జనసేనకు రాధమ్మ రాజీనామా


రాధమ్మ

కొత్తపేట: జనసేన పార్టీ నాయకురాలు బండి సత్యరాధ (రాధమ్మ) ఆ పార్టీకి రాజీనామా చేశారు. సామాజికవేత్తగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ గుర్తింపు పొందారు. రాజకీయ పరిణామాలు, జనసేన-టీడీపీ పొత్తు నేపథ్యంలో ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు కొత్తపేటలో ప్రకటించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సోషల్ వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నా.. తనకు ఏ విధమైన గుర్తింపు ఆ పార్టీలో లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ సూచన మేరకు పార్టీ ఫార్మేషన్ కమిటీలో సభ్యురాలిగా నియమించారని, కానీ ఏ ఒక్క మీటింగ్‌కు పిలవలేదన్నారు. పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లో నైతిక విలువలు, కొత్త ఒరవడి, మంచి పాలన తీసుకువస్తారని ఆశించి యువత ఆయన వెనుక ప్రయాణించారని, నేడు టీడీపీతో కలవడంతో ఎంతోమంది బయటకు వచ్చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో కొత్తపేట నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. విజయం సాధించడం ద్వారా ప్రజల్లో తన స్థానం ఏమిటో రుజువు చేసుకుంటానని రాధమ్మ అన్నారు.

అనారోగ్య బాధితుడి వైద్యానికి సాయం


అనారోగ్య బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: సుగర్ వ్యాధితో బాధపడుతూ కాలిలో రక్తప్రసరణ నిలిచిపోవడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. పేదరికంతో ఉన్న వారు వైద్యానికి సాయం చేయాలని స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరడంతో రూ.12 వేల నగదు సాయంగా ఆదివారం అందజేశారు. గ్రామంలోని కొత్త కాలనీకి చెందిన మనుపటి శ్రీనుకు కొంత కాలంగా సుగర్ బాగా పెరిగిపోయి కాలులో రక్త ప్రసరణ ఆగిపోయి కాలు తీసెయ్యాలని డాక్టర్లు చెప్పారు. శ్రీను తల్లి ఇళ్లల్లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వైద్యం చేయించుకునే స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో ఆదివారం సంస్థ సభ్యులు శ్రీను ఇంటికి వెళ్లి రూ.12 వేల నగదు సాయాన్ని అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో మార్గాని రమేష్ (43) అనుమానాస్పదంగా ఆదివారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం మృతుడు రమేష్ శనివారం రాత్రి తన వ్యాపార లావాదేవీలను ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాడు. ఆదివారం ఉదయం చూసేసరికి నోటి, ముక్కు నుంచి రక్తం కారి విగతజీవిగా మృతి చెంది ఉన్నాడు. మృతుడు రమేష్‌కు, భార్యకు గత కొద్ది కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లోను, భార్య పుట్టిల్లు అయిన పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం దర్శిపర్రు. పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే అప్పటి నుంచి వారిద్దరు కాపురాన్ని సజావుగానే చేసుకుంటున్నారు. తన భర్త రమేష్ గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని భార్య చెబుతుంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారనే కారణంగా రమేష్‌ను అతడి భార్య పథకం ప్రకారం హత్య చేసినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడు రమేష్ రావులపాలెం ఆర్టీసీ బస్టాండులో జామకాయలు విక్రయిస్తుంటాడు. ఈ మేరకు ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కేసును నమోదు చేయగా రావులపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


దిండిలో కలసిన పూర్వ విద్యార్థులు

మలికిపురం: 43 ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఏర్పడిన బంధాన్ని నేటికీ గుర్తుచేసుకుంటూ.. తమతో కలసి చదువుకున్న విద్యార్థులను మరోసారి కళ్లారా చూసుకున్నారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదా కబుర్లతో రోజంతా గడిపారు. 1976-81 మధ్యకాలంలో శివకోటి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీరంతా విద్యనభ్యసించారు. నాటి స్నేహితులను మరోసారి కలుసుకోవాలనుకున్నదే తడవుగా ఆదివారం నాడు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 43 ఏళ్ల అపూర్వ కలయిక ఆదివారం మలికిపురం మండలం దిండి టూరిజం కేంద్రంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాటి విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు గురువులు చెప్పిన సూచనలు పాటిస్తూనే ఉన్నత స్థానాల్లో ఉన్నామని అందుకు గురువులకు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బంద్రెడ్డి విజయప్రసాద్, కడలి రవి వరప్రసాద్, నల్లి వెంకటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.